క్లుప్తంగా

అవకాశం కల్పించాలని వినతి

కల్వకుర్తి టౌన్‌: నియోజకవర్గ స్థాయిలో ఉండే మార్కెట్ కమిటీ పదవులలో యూత్ కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి యూత్ కాంగ్రెస్ నియోజవకర్గ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజవకర్గ అధ్యక్షుడు అనిల్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆస్పత్రి వద్ద రోగులకు అన్నదానం



మన్ననూర్: స్థానిక ఆర్టీటీ ఆస్పత్రికి వచ్చే రోగులకు మహ్మద్ ప్రవక్త (అల్లా) పేరున అదే గ్రామానికి చెందిన ఎండీ మన్సూర్ అన్నదానం చేశారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేసినట్లు తెలిపారు. సోమవారం రోజు ఆస్పత్రి వైద్యుడు సైపుల్లాఖాన్ సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చిన సుమారు 100 మందికి మధ్యాహ్నం సమయంలో భోజనాలు, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబలి, పరమేష్ ఆస్పత్రి సిబ్బంది, భాస్కర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డీఎస్సీలో తెలకపల్లి వాసికి 2వ ర్యాంకు



డీఎస్సీలో జిల్లా 2వ ర్యాంకు సాధించిన కొమ్ము రమేష్

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన కొమ్ము రమేష్ డీఎస్సీలో నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గురుకులాల్లో పీజీటీగా ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు.ఈ సందర్భంగా కొమ్ము రమేష్‌ను మండల ప్రజలు అభినందించారు.

చెన్నపురావుపల్లి విద్యార్థికి జిల్లా మూడో ర్యాంకు

పెద్దకొత్తపల్లి: డీఎస్సీ ఫలితాల్లో సాంఘీక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులో ఏ మనోజుకుమార్ జిల్లా మూడో ర్యాంకు సాధించాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం, చెన్నపురావుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, భాగ్యమ్మ కుమారుడు ఏ మనోజుకుమార్ 100 మార్కులకు గాను 81 మార్కులు సాధించాడు. జిల్లా మూడో ర్యాంకు సాధించడంపై మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్యలు మనోజుకుమార్‌ను అభినందించారు.

వ్యక్తికి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: వినాయక నిమజ్జన వేడుకల్లో పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించిన వినాయక చవితి నిమజ్జన వేడుకల్లో జిల్లా కేంద్రానికి చెందిన పాలమూరు శివ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు డీఎస్పీని దూషించడంతో అతడిపై కేసును నమోదు చేశారు. సోమవారం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పులిహోర పంపిణీ



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక జనరల్ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన సదరం క్యాంపులో పాల్గొన్న వికలాంగ సభ్యులకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో పులిహోరను పంపిణీ చేశారు. ఆస్పత్రి ఆర్ఎంఓ శివ కుమార్, వికలాంగుల సంఘం నాయకులు రాజశేఖర్, దేవేందర్ తదితరులు పాల్గొని పులిహోర అందజేశారు.

మహిళ అదృశ్యం

వెల్దండ: మండలంలో మహిళ అదృశ్యమైన సంఘటన చెర్కూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కేశమోని లక్ష్మమ్మ(55) ఈనెల 26న వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె 29న పశువులను వెతకడానికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుణాలు చెల్లించాలి

వెల్దండ: సింగల్‌విండో బ్యాంక్‌లో రుణాలు తీసుకున్న రైతులందరు సకాలంలో చెల్లించాలని సింగల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. సోమవారం సింగల్‌విండో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



ఉప్పునుంతలలో వయోవృద్ధుల దినోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

సాక్షి, నెట్‌వర్క్: ఉప్పునుంతల మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వయస్సు పైబడిన వృద్ధులు ఆరోగ్యం విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిశుభ్రత పాటించడంతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ప్రతినిధి రేణుక, స్థానిక అంగన్‌వాడీ టీచర్లు పద్మ, భార్గవి, సరస్వతి, ఆయాలు, వృద్ధులు పాల్గొన్నారు.

- పెద్దకొత్తపల్లిలో అంతర్జాతీయ వయోవృద్ధ దినోత్సవాన్ని పురస్కరించుకుని గంట్రావుపల్లిలో 1వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం వయోవృద్ధులను శాలువాలు, పూలమాలలతో సన్మానించినట్లు అంగన్‌వాడీ టీచర్ శోభారాణి తెలిపారు. 70 ఏళ్ల పూర్తి చేసుకుని ఆరోగ్యంగా వృద్ధులు సుదీర్ఘంగా జీవించడం భావితరాలకు ఆదర్శమన్నారు. వారి అనుభవాలు యువకులు పిల్లలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు మోతీరాం మాట్లాడుతూ కుటుంబంలో వృద్ధులను గౌరవంగా చూసుకోవాలన్నారు.
- కల్వకుర్తి పట్టణంలోని ప్రజల భాగస్వామ్య సంస్థ వృద్ధాశ్రమంలో గ్రాండ్ పేరెంట్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీఓ భాగ్యమ్మ హాజరై వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి సత్కరించారు.
- లింగాల మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. వయోవృద్ధులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాల గురించి ఐసీడీఎస్ సీడీపీఓ దమ యంతి, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య

తెలకపల్లి: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలని సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో స్వేరోస్ విజ్డం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యాదయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో చదవాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, శాంతినికేతన్ గ్లోబల్ పాఠశాల కరస్పాండెంట్ సురేందర్, ప్రిన్సిపల్ దీపా సెబాస్టియన్, ఉపాధ్యాయులు పరశురాములు, రమేష్, తిరుపతయ్య, వెంకటేష్, స్వేరోస్ నాయకులు సంతోష్‌కుమార్, రాము పాల్గొన్నారు.

కల్వకుర్తి బాలోత్సవాల కమిటీ ఏర్పాటు



బాలోత్సవ కమిటీ సభ్యులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో సోమవారం మధ్యాహ్నం మేధావులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు వివిధ రంగాల నాయకులు, కళాకారుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు ఏపీ మల్లయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో అభ్యుదయ భావజాలంతో శాస్త్రీయ ఆలోచన దిశగా, సరైన మార్గదర్శకాలతో పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని నిర్ణయించినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని బాలోత్సవ కమిటీ 11 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా చెన్నయ్య, కోకన్వీనర్‌గా వెంకటయ్యలను ఎన్నుకున్నారు. సభ్యులుగా 11 మందిని ఎంపిక చేశారు. రాబోయే రోజుల్లో చిన్నారులలో ఉన్న బలహీనతలు తొలగించి మానవ సంబంధాలు పారుగువారికి తోడ్పాలనే భావన కల్పించే విధంగా తీర్చిదిద్దుతామని కన్వీనర్ చిన్నయ్య చెప్పారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది కొరత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని మెడికల్ వార్డు, డయాలసిస్ సెంటర్, గైనిక్ వార్డులను తిరిగి రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీసీహెచ్ఓ రామకృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, వైద్యులు మహేష్, బిక్కులాల్, ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలోని ఆమనగల్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీలలో యువజన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాల్‌రాజు, రాజశేఖర్, శ్రీకాంత్, జావేద్, రమేష్, శ్రీశైలం, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్ షిప్ విడుదల చేయాలి



కొల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు డీ.శేఖర్, కలర్ మహేష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కొల్లాపూర్ ఆర్డీఓ నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్, చక్రినాయుడు, కుందేన పవన్‌కుమార్‌గౌడ్, రాజు, సురేష్, తరుణ్ తదితరులున్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ గ్రామంలో కొద్ది రోజులుగా సిరిగిరి శంకర్ బైక్ పైనుంచి కింద పడడంతో కోమలోకి వెళ్లాడు. దీంతో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన స్నేహితుడికి అదే గ్రామానికి చెందిన స్నేహితుడు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జమ చేసిన రూ.67,750 లను సోమవారం తండ్రి వెంకటరాములుకు అందజేశారు. ఆంజనేయులు, భూషణ్‌గౌడ్, సతీష్, రవి పాల్గొన్నారు.

అకౌంట్ నుంచి నగదు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు అకౌంట్ నుంచి నగదు చోరీ చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాలు ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులు ఫోన్‌ను ఈనెల 7న సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి అకౌంట్లో ఉన్న రూ. 47వేలను విడతల వారీగా చోరీకి పాల్పడ్డారు. అకౌంట్ నుంచి డబ్బులు పోవడం గమనించిన శ్రీనివాసులు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో సోమవారం చోరీ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



కొల్లాపూర్: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కొల్లాపూర్‌లోని ఆర్‌ఐడీ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులను విధులను విడిచిపెట్టి, బయట ప్రైవేటు కార్యక్రమాలకు హాజరవుతున్నారని ఆయన ఆరోపించారు. ఉపాధ్యాయుల తీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు. విద్యాబోధన చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్ తదితరులున్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



ఉప్పునుంతల వైద్యశిబిరంలో పాల్గొన్న ఎంపీడీఓ, వైద్యాధికారి

కల్వకుర్తి టౌన్/ ఉప్పునుంతల/అమ్రాబాద్/ తాడూరు/ బల్మూర్/లింగాల: స్వచ్ఛత హీ సేవ 2024 పక్షోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక రైతు వేదికలో గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది కోసం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ నారాయణ, వైద్యాధి కారి స్వప్న, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- అమ్రాబాద్ మండల కేంద్రంలో హెల్త్ సబ్‌సెంటర్‌లో ఇరవై గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరంలో ఎంపీడీఓ వెంకటయ్య, డాక్టర్ రమాకాంత్, 92మంది వర్కర్లు ఉన్నారు.
- తాడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మల్టీపర్పస్ పంచాయతీ వర్కర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.
- బల్మూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వర్కర్లకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు, వైద్యురాలు ప్రశాంతి, వెంకట్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.
- కల్వకుర్తి పట్టణంలో విద్యార్థులు వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా ప్రభుత్వ పాఠశాల నుంచి కూరగాయల మార్కెట్ వరకు మెప్మా సిబ్బందితో కలిసి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శివ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
- లింగాల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులకు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్: హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కొల్లాపూర్‌లో హమాలీలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథంతో పాటు హమాలీలు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కల్వకుర్తిరూరల్: పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయనిధి ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తిలో తలకొండపల్లికి చెందిన అంజనమ్మకు సీఎం సహాయనిధి చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, లింగం, కిశోర్ పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని ధర్నా

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పని చేస్తున్న పార్ట్‌టైం ఉద్యోగులు ప్రభుత్వం వెంటనే మూడు నెలల వేతనాలు విడుదల చేయాలని కళాశాల ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గత మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్ట్‌టైం ఉద్యోగులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకలు



కొల్లాపూర్: బతుకమ్మ వేడుకలను సోమవారం కొల్లాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. విద్యార్థినులను బతుకమ్మలను పూలతో అలంకరించారు. బతుకమ్మలకు పూజలు నిర్వహించి, ఆడి పాడారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్ మాట్లాడారు. బతుకమ్మ వేడుకల విశిష్టతను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

డీఏవీ విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు

దోమలపెంట: దోమలపెంటకు చెందిన మహమ్మద్ హఫీజ్ బాబా వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. సోమవారం హైదరాబాద్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో జరిగిన కౌన్సిలింగ్‌లో హఫీజ్ బాబాకు నీట్‌లో వచ్చిన ర్యాంక్ ప్రకారం వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు కేటాయించినట్లు వారు తెలిపారు. గ్రామస్తులు బెజ్జెం మల్లికార్జున, మెయిజ్, కస్తూరి బుచ్చిరాములు, సుబ్బారెడ్డి, సురేష్, నాగమల్లికార్జున, డీఏవీ ప్రిన్సిపల్ జె.ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మారుమూల ప్రాంతాలకు సెల్‌ఫోన్ సౌకర్యం

మన్ననూర్: మారుమూల ప్రాంతాలకు సైతం సెల్‌ఫోన్ సిగ్నల్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం పట్ల ఉమ్మడి అమ్రాబాద్ మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని మారడగు, మద్దిమడుగు, ఇప్పలపల్లి తదితర అటవీ పరిసర ప్రాంతంలోని చెంచు పెంటల్లో నివాసం ఉంటున్న వారికి ఇప్పటి వరకు సిగ్నల్ లేని కారణంగా సెల్‌ఫోన్ సౌకర్యం లేదు. దీంతో ఈ ప్రాంతంలోని ప్రజలు కొన్ని సమయాల్లో అత్యవసరాలు ఉన్నప్పుడు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కొంత కాలంగా ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రస్తుత నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి సహకారంతో ఫారెస్టు క్లియరెన్స్ చేసి వంకేశ్వరంలోని సెల్ టవర్ సామర్థ్యంను పెంచి ఆయా గ్రామాలకు సిగ్నల్ అందే ఏర్పాట్లు జరగడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన ఐద్వా మహాసభలు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఐద్వా జిల్లా మహాసభలు ముగిశాయి. మహాసభల్లో నూతన జిల్లా అధ్యక్షురాలిగా నిర్మల, కార్యదర్శిగా కందికొండ గీత, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మి, శివలీల, పద్మ, సహాయ కార్యదర్శులుగా సంధ్య, అలివేలమ్మ, కోఆప్షన్ సభ్యులుగా ఈశ్వరమ్మ, నాగలక్ష్మీ, గుండమ్మ, పార్వతమ్మ, మరికొందరిని ఎన్నుకున్నారు.

కేఎల్ఐ కాల్వకు మరమ్మతు



వెల్దండలో తెగిన కేఎల్ఐ కాల్వకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వెల్దండ: మండల కేంద్రంలోని లచ్చపురం చెరువు సమీపంలో తెగిన కేఎల్ఐ కాల్వకు అధికారులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఈనెల 30న 'వృథాగా సాగునీరు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైంది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు డీ–82 కాల్వ డీఈఈ సమ్మయ్య కాల్వకు మరమ్మతులు చేపట్టారు. కేఎల్ఐ కాల్వలకు రైతులు గండ్లు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల్లో కేఎల్ఐ కాల్వ ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామన్నారు.

నల్లమల వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన మధును సత్కరిస్తున్న పర్యవేక్షకుడు డాక్టర్ మద్దిలేటి పసుపుల

అమ్రాబాద్: పాలమూరు యునివర్సిటీలో పది సంవత్సరాల నుంచి గణిత శాస్త్రం బోధిస్తున్న అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లి గ్రామానికి చెందిన మోటమారి మధు సోమవారం మహత్మాగాంధీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. స్ట్రెచింగ్‌షీట్ ద్వారా క్యాసన్ నానోఫ్లూయిడ్ పై ఉష్ణబదిలి ప్రభావాల సంఖ్యావిధానం అనే అంశంపై పరిశోధన చేసిన ఆయన మహత్మా గాంధీ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీలో డాక్టరేట్ లభించింది. ఈ మేరకు పర్యవేక్షకుడు డాక్టర్ మద్దిలేటి పసుపుల సమక్షంలోయునివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. నిరుపేద కుటుంబంలో బాలకిష్టమ్మ, స్వామిదాసులకు పుట్టిన మధు పదో తరగతి వరకు అమ్రాబాద్ ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియెట్, డిగ్రీ అచ్చంపేటలో పూర్తి చేసి2019 లో మహత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందారు. మధు డాక్టరేట్ సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కల్వకుర్తి వాసికి..



అశోక్‌కుమార్

కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన కొండూరు అశోక్‌కుమార్ డాక్టరేట్‌ను సాధించారు. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సంతోష్‌నగర్‌లోని ఓ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ విభాగంలో ఆయన సేవలందిస్తున్నారు. దేశంలో ప్రసిద్ధి చెందిన వెల్‌టెక్ విశ్వవిద్యాలయంలో స్పీచ్ ఎమోషన్ డిటెక్షన్ యూసింగ్ మిషన్ లర్నింగ్ అనే అంశంపై అశోక్‌కుమార్ పరిశోధన చేశారు. ఈ పరిశోధన ఆచార్య ఇక్బాల్ పర్యవేక్షణలో చేయగా దానిని ఆచార్యులు అనుజ్‌జైన్, దామోదర్‌రెడ్డిలు ధ్రువీకరించారు. దీంతో ఆయనకు పీహెచ్‌డీ పట్టా లభించింది. కల్వకుర్తికి చెందిన అశోక్‌కుమార్ డాక్టరేట్ సాధించడంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి



గండ్ల బీఎంసీయు అధ్యక్షులు శ్రీనునాయక్, వైద్య సిబ్బంది నరేష్‌రెడ్డి, నర్సింహ, బాలు ఉన్నారు.

వెల్దండ: పాడి పశువులకు సీజనల్‌లో సోకుతున్న వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య అధికారి డాక్టర్ శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కేస్లీతండాలో పాడిపశువులకు గాలికుంటు టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడిఆవులకు ఎలాంటి వ్యాధులు సోకినా వైద్యులను సంప్రదించి చికిత్స నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కుప్ప

రుణాలకోసం ఎదురుచూపులు

పెద్దకొత్తపల్లి: బ్యాంకుల్లో కొత్త పంట రుణాల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు, పెద్దకార్పాములలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు కల్వకోలులోని ఏపీజీవీబీ బ్యాంకు కొత్తపేట, పెద్దకొత్తపల్లి సింగిల్ విండోల చుట్టూ రైతులు జూన్ నుంచి బ్యాంకుల చుట్టూ కొత్త రుణాల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆ డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేయడంతో వారికి ఇచ్చేందుకే బ్యాంకు అధికారులు సుముకత చూపుతున్నారు. వానాకాలం సీజన్ పూర్తయి అక్టోబర్ నుంచి యాసంగి సీజన్ ప్రారంభం కాబోతున్నది. కొత్త రుణాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

వెల్దండ: బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వెల్దండ మండల కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీలో బీజేపీ మండల అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంగయ్యయాదవ్, నాయకులు రామకృష్ణ ఉన్నారు.

తూడుకుర్తిలో ప్రేరణ తరగతులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని తూడుకుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రేరణ తరగతులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రముఖ సైకాలజిస్టు ప్రొఫెసర్ విశ్రాంత పర్యవేక్షణాధికారి హనుమంతురెడ్డి హాజరై విద్యార్థులకు క్లాసులు బోధించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కరుణాకర్‌రెడ్డి, కృష్ణమోహన్‌బాబు, ప్రకాశ్‌బాబు, ప్రసాద్‌బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారి భరతనాట్యం

తాడూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత హీ సేవ వారోత్సవాల్లో భాగంగా ఎంపీడీఓ బ్రహ్మచారి చిన్నారి కృష్ణవేణితో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శించారు. మండల కేంద్రం, 24 గ్రామపంచాయతీలలో స్వచ్ఛత హీ సేవపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వాహనాల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, ఎత్తం గ్రామ శివారులో ఎస్‌ఐ గోకారి సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ద్విచక్ర వాహనానికి సంబంధించిన ఆర్‌సీ లైసెన్స్, హెల్మెంట్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.